ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించండి: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ /పార్వతీపురం: పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలలకు, జిల్లాకు మంచి పేరు తెచ్చిపెట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ డివిఎమ్ఎమ్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కరచాలనం చేసి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు ఏర్పరుచుకున్న ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ప్రధానమంత్రి పరీక్షలపై చర్చా కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు సానుకూల దృక్పథంతో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించినట్లు గుర్తు చేశారు. బంగారు భవితకు పదోతరగతి, ఇంటర్మీడియట్ కీలక మలుపునిస్తుందని విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపారు. ముందున్న లక్ష్యాల సాధనకు ఏకాగ్రతతో చదువే ధ్యాసగా శ్రామించాలని సూచించారు. అనుకున్నది సాధించి ఆనంద క్షణాలను ఆస్వాధించడంలోనే అసలైన సంతృప్తి ఉంటుందన్నారు. విద్యార్థులు ఆత్మనూన్యతను వీడి వెనుకబడిన పాఠ్యాంశాల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. చదువుతో పాటు ఆరోగ్యంపై

శ్రద్ధ వహించాలని, మానసిక ఉల్లాసానికి క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వ్యక్తిగతంగా ప్రోత్సాహకాలను అందిస్తానని వారిలో ప్రేరణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుపతి నాయుడు, మండల విద్యాధికారి వై.విమలకుమారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులను, కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు పొరుగు సేవల సిబ్బందిని నియమించుకునే అధికారం వివిధ శాఖలకు ఇవ్వాలనే రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం ఉపసంహ రించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. శనివారం పార్వతీపురం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో నిరసన చేపట్టి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సి.హెచ్.సింహాచలం, ఎన్.శంకర్రావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్గం ఈనెల 6వ తేదీన జరిగిన సమావేశంలో ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు పొరుగు సేవల కార్మికుల నియామకాలను వివిధ ప్రభుత్వ శాఖలకు అధికారం ఇవ్వాలని తీర్మానించినట్లు మీడియాలో, పత్రికల్లో వార్తలు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలకు అధికారాలు ఇస్తే కార్మికులకు ఉద్యోగభద్రత లేకుండా పోతుందని, నిత్యం అభద్రతతో పనిచేయాల్సి వస్తుందని వాపోయారు. ఈ కార్యక్రమంలో మామిడి శివ, పి.సంతోష్, బి.రాజేష్, జి.గంగరాజు, గంగేయ్యులు, బి.రవి, సుజాత, ఇప్పలమ్మ, పాపులమ్మ, శాంతి, చిరంజీవి పాల్గొన్నారు.

పది, ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల నిమిత్తం ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరికృష్ణ మాట్లాడుతూ మార్చి నెలలో టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరగబోతున్నాయన్నారు. హాల్ టికెట్ ఉన్న ప్రతి విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని, స్టూడెంట్స్ బస్సులు, ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు ఇబ్బంది లేని విధంగా సమయ పాలనతో బస్సులు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఈ పరీ క్షలు చాలా కీలకమన్నారు. ఆర్టీసీ అధికారులు పూర్తిస్థాయిలో విద్యార్థులకు సహక రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గ పాల్గొన్నారు.

శివరాత్రికి సిద్ధమవుతున్న గుంప సోమేశ్వరస్వామి ఆలయం

విశాలాంధ్ర - కొమరాడ: ఈనెల 26, 27 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే మహాశివరాత్రికి గుంప సోమేశ్వర ఆలయం ఏర్పాటల్లో దేవస్థానం ఈవో మండల ప్రసాదరావు శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ నాగావళి, జంఝావతి నదుల మధ్య ఉన్న శ్రీ సోమేశ్వర స్వామి ఆలయాన్ని వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టెంట్లు, బారికేడ్లు ఆలయం ముందు భాగం వెనుక భాగం భక్తులకు దర్శనార్థం టెంట్లు ఈఓ దగ్గర నుండి పరిశీలిస్తున్నారు. మహా శివరాత్రికి ఒరిస్సా ఆంధ్ర నుండి ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. దీంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ సిబ్బందితోపాటు ఆలయ అర్చకులు, సమీప గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రికి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ ఏర్పాటులో దేవాదాయ శాఖ సిబ్బంది శ్రీనివాసరావు, ఆలయ అర్చకుల పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - మక్కువ: స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఆ శాఖ పనితీరును సభ్యులకు వివరించారు. ఆర్టీసీ అధికారులకు పలుమార్లు బస్సులను పునరుద్దించమని కోరినప్పటికీ అధికారులు పట్టించుకోక పోవడంతో ఆ శాఖ అధికారులు పట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ అధ్యక్షులు ఎంపీపీ మర్రిపారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావులు మాట్లాడుతూ పశు వైద్య అధికారి తమ శాఖకు కేటాయించిన సమయంలో అధికారి హాజరు కాకపోవడంతో ఆయన ఎంపీడీవో స్వరూపారాణికి ఏ ఏ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు అని అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలకు ఒకసారి అయ్యే సమావేశానికే రాని అధికారుల తీరును ఆయన తప్పు పట్టారు. హాజరుకాని పశువైద్యాధికారి పైన, ఐటీడీఏ ఏఈ, ప్రాజెక్ట్స్ ఏఈ, ఆర్ అండ్ బి ఏఈలపైన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయమని ఎంపీడీవోకి సూచించారు. దీనిపై ఎంపీడీవో స్వరూప రాణి ఆయా శాఖల అధికారులపై తగు చర్యలు నిమిత్తం జిల్లా కలెక్టర్ నివేదిక ఇవ్వనున్నట్లు ఆమె వెల్లడించారు.

పారమ్మకొండ జాతర ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర - పాచిపెంట: పారమ్మకొండ జాతర ఏర్పాట్లపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శనివారం పరిశీలించారు. మహాశివరాత్రి సందర్భంగా పారమ్మ తల్లి జాతరపై అధికారులను ఆరా తీశారు. శనివారం ఆమె పారమ్మ కొండను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఇక్కడ ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగు సూచన సలహాలు అందించారు. గిరిజనుల ఆరాధ్య దైవం పారమ్మ తల్లిని ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా గిరిజన వ్యక్తినే నియమించడం జరుగుతుందని చెప్పారు. ఈమెతో పాటు తాసిల్దార్ రవి, ఈఓ రమేష్, పాంచాలి సర్పంచ్ గూడేపు యుగంధర్, తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖి సూర్యనారాయణ, మంచాల పారమ్మ, చల్ల కనక బాబు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి కొత్తల పోలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక చర్చివీధిలో గల వార్డు విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజ్ఞాన కేంద్రంలో గ్రూప్-2, ఇతర పోటీ పరీక్షలకు సాధన చేస్తున్న యువతీ, యువకులతో మాట్లాడారు. వసతులపై ఆరా తీశారు. అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా, విద్యా ప్రమాణాలు ఉన్నతీకరించు కోవడానికి, ఉన్నత స్థాయికి చేరుకోవడానికి నిరంతర శ్రమ అలవర్చుకోవాలని అన్నారు. భవిష్యత్ కలలు, ఉన్నత లక్ష్యాలను ఛేదించేందుకు అవసరమైన జ్ఞాన సంపదను విజ్ఞాన కేంద్రాల ద్వారా పెంపొందించుకోవాలన్నారు. నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా వివిధ ఉద్యోగ ప్రకనలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుపతి నాయుడు, మండల విద్యాధికారి వై.విమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

పాకలపాటి రఘువర్మ గెలుపునకు కృషి చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: ఈనెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర కోరారు. క్యాంప్ ఆఫీస్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనేక విద్యా సంస్కరణలు చేస్తుందని, వాటికి రఘువర్మలాంటి మేధావుల సహకారంతో మరింత ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం రఘువర్మకు మద్దతుగా ఉందన్నారు. ఉపాధ్యాయులంతా ఆలోచన చేసి విద్యారంగ అభివృద్ధికి రఘువర్మ లాంటి ఉన్నతమైన వ్యక్తుల అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏపీటీఎఫ్ నుండి పోటీ చేస్తున్న రఘువర్మకు అనేక ఉపాధ్యాయ సంఘాలు మద్దతుగా నిలిచాయని, ఆయన గెలుపు తథ్యమన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా రఘువర్మకు మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. ఆయనతోపాటు పార్టీ పరిశీలకులు బొద్దు పైడిరాజు నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాజశేఖరం గెలుపునకు మాజీ ఎమ్మెల్యే ప్రచారం

విశాలాంధ్ర - సీతానగరం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాభత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు తుని నియోజకవర్గంలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. తుని నియోజకవర్గంలోని కోటనందూరు మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పట్టభద్రులను కలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించినట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా పార్టీ అధిష్టానం నియమించడంతో అక్కడ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తనతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీసా చట్టంపై శిక్షణ

విశాలాంధ్ర - సీతంపేట: మండలంలోని 41 షెడ్యూల్డ్ గ్రామపంచాయతీల సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీ సభ్యులు, పీసా వైస్ ప్రెసిడెంట్లు, కార్యదర్శులకు, ఎస్‌హెచ్‌జి సభ్యులకు, సంబంధిత సచివాలయ సిబ్బందికి పీసా చట్టంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం వైటిసి సీతంపేట వెలుగు సమావేశ మందిరంలో నిర్వహించడం జరిగింది. సీతంపేట మండలంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమానికి 1756 మంది హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పంచాయతీల విస్తరణ చట్టం 1996, ఆంధ్రప్రదేశ్ పీసా రూల్స్ 2011, పీసా చట్టంలోని అంశాలను వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్ వల్లా త్రినాధరావు కూడా హాజరై వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి జయంతి రమా ప్రసాద్, ఎంపీడీవో గీతాంజలి, ఈవో పీఆర్ అండ్ ఆర్ డి సత్యం, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - సీతంపేట: సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలోని మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలో ప్రహరీ సమస్య ఉందని పీవో దృష్టికి తీసుకురాగా దీనిపై స్పందించిన పీవో ప్రహరీ పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, పాఠశాల హెచ్ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ అమల, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టిలోనే చిన్నారుల చదువులు

- ప్రభుత్వాలు మారుతున్న మారని తీరు
- పట్టించుకోని అధికారులు
- ఇదీ దబ్బలపాడు ప్రైమరీ పాఠశాల దుస్థితి

విశాలాంధ్ర - అనంతగిరి: మండల పరిధిలో ఉన్న దబ్బలపాడు పాఠశాలలో మట్టిలోనే కూర్చుని పాఠాలు వినాల్సి వస్తున్న సంఘటన ఎదురయింది. చిలకలగడ్డ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ధబ్బలపాడు ప్రైమరీ పాఠశాలలో 29 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే పాఠశాల భవనం పురాతనం అవడం ఒక ఎత్తు అయితే నేలమీద కూర్చుని విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి. గత ప్రభుత్వం నాడు నేడు అని అనేక పాఠశాలల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేశారు. కానీ మండలంలో కొన్ని పాఠశాలలు అసలు కనీస సౌకర్యాలు కూడా కనిపించకపోవడం విచారకరం. అందులో భాగంగా దబ్బలపాడు గ్రామంలో ఉన్న పాఠశాలలో చిన్నారులు మట్టిలో కూర్చొని ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు వినాల్సి వస్తుంది. ఈ విషయంపై ఉపాధ్యాయుడ్ని వివరణ కోరగా నాడు నేడులో ఈ పాఠశాల ఎంపిక కాలేదని అందువల్ల నిధులు మంజూరు కాలేదని తెలిపారు. మండలంలో ఇటువంటి పాఠశాలలు అనేకం దర్శనమిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి ప్రైమరీ పాఠశా లలను కనీస సౌకర్యాలతో మరమ్మతులు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో చిన్నారులకు విద్య ఎంతో ముఖ్యమని కావున ఉన్నతాధికారులు గ్రామాలలో ఉన్న పాఠశాలలను గుర్తించి మరమ్మతులు నిర్వహించి సుందరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వాసులు కోరుతున్నారు.

రైతుల పట్ల వివక్ష చూపుతున్న కూటమి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పాడేరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష చూపుతోందని, పచ్చ మీడియా ప్రజలను తప్పుదోవ పట్టించే కథనాలు రాస్తుందని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతుల పట్ల వివక్షత చూపుతూ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పబ్బం గడుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ ఎక్కడ అమలు చేస్తున్నారని, అబద్దపు హామీలతో గద్దెనెక్కి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మిర్చి రైతుల సమస్యలు తెలుసుకోవడానికి మిర్చి యార్డులో సందర్శిస్తే వాటిని రాజకీయం చేసి పచ్చ మీడియా తప్పుడు కథనాలు రాసి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ఇటువంటి చర్యలు మానుకోవాలని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గిరిజనుల హక్కులు చట్టాలను ఉల్లంఘిస్తూ 1/70 చట్టాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నాదానికి 2018లో మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి లేఖతో తేటతెల్లమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సీదారి మంగ్లన్న దొర, కురుసా పార్వతమ్మ, కూడ సురేష్ కుమార్, లకే. రామకృష్ణ పాత్రుడు, కూడ సుబ్రమణ్యం, కిల్లో ఊర్వశి రాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

లంబసింగిలో జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయండి

విశాలాంధ్ర - చింతపల్లి: లంబసింగిలో జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేసి గ్రామస్తులు గృహాలు నిర్మించుకునేందుకు మార్గం సుగమం చేయాలని లంబసింగి గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు. రహదారుల అభివృద్ధిలో భాగంగా జాతీయ రహదారి పనులు చేస్తున్న గుత్తేదారులు రహదారి విస్తరణ పనులలో భాగంగా రహదారులకు ఇరువైపులా ఉన్న గృహాలను తొలగిస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఇందులో భాగంగా లంబసింగి గ్రామంలో గృహాలను సంక్రాంతి పర్వదినానికి ముందే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని గ్రామస్తులకు సూచించిన గుత్తేదారులు నేటి వరకు పనులు ప్రారంభించకపోవడంతో స్వచ్ఛందంగా గృహాలను తొలగించుకొని గుడారాలలో నివాసం ఉంటున్న. తామంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని లంబసింగి వాసులు గగ్గోలు పెడుతున్నారు. త్వరితగతిన రహదారి నిర్మాణ పనులు పూర్తిచేస్తే తామంతా గృహాలు నిర్మించుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా జాతీయ రహదారి విస్తరణ నిర్మాణ పనులు చేపట్టే గుత్తేదారులు రాబోవు వరుస కాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన లంబసింగి గ్రామానికి చెందిన రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రఘువర్మను గెలిపించాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: ఈనెల 27వ తేదీన జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి శాసన మండలికి పోటీ చేస్తున్న ఏపీటీఎఫ్, ఇతర అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన ఉద్యమ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపునకు కృషి చేయాలని ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు పిలుపునిచ్చారు. మండల టీడీపీ నాయకులతో కలిసి ప్రచారం ప్రారంభించారు. రఘువర్మకి మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఉపాధ్యాయ ఓటర్లకు తెలిపారు. ఈయన గెలుపు కోసం వివిధ రకాల 16 సంఘాలు ఆయనకు మద్దతిస్తున్నాయని తెలిపారు. ప్రచారంలో భాగంగా కొక్కిరాపల్లి, జి.మాడుగుల ఆశ్రమ బాలికల పాఠశాల, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, గురుకుల కళాశాల, కేజీబీవీ, మినీ గురుకులం, సిహెచ్ స్కూల్, ఏపీఆర్ స్కూల్, గవర్నమెంట్ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమేలి చిట్టిబాబు, సీనియర్ నాయకులు మత్స్యరాస మత్స్యరాజు, లకే బాలయ్య దొర, శోభ శ్రీను, సర్పంచులు పాలసి కృష్ణా మూర్తి, కొండపల్లి సింహాచలం, సెగ్గే కొండలరావు, పాలసీ సూరిబాబు, కెవిఎస్ఎస్ ప్రసాద్, లోచెలి మహేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ వేడుకలు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని, విద్యార్థులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలతో పాటు గిరిజన సంప్రదాయమైన థింసా నృత్యాలను ప్రదర్శించారు. విద్యార్థుల థింసా నృత్యాల ఆటపాటలతో కళాశాల ఆవరణ అంతా పండగ వాతావరణం కనిపించింది. కళాశాల విద్యార్థిని, విద్యార్థులు జరుపుకునే ఫేర్వెల్ డే ఫంక్షన్‌కు హాస్టల్ వెల్ఫేర్ అధికారి పలాసి రవికుమార్ ముఖ్య పాత్ర పోషిస్తూ ఫంక్షన్ ఘనంగా నిర్వహణకు తోడ్పాటు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

"జ్ఞాన జ్యోతి"తోనే చిన్నారులకు సమగ్రాభివృద్ధి

విశాలాంధ్ర - కొయ్యూరు: ఐదేళ్ళలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసమే జ్ఞాన జ్యోతి పేస్ టూ శిక్షణ ఇస్తున్నట్టు కొయ్యూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కె.విజయకుమారి అన్నారు. మండలంలోని కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సిడిపిఓ విజయకుమారి ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి పేస్ టూ శిక్షణ తరగతులను ప్రారంభించారు. అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించే ఈ శిక్షణలో పిల్లలకు ఫొటో పిక్చర్ తో ఏ విధంగా తయారు చేయాలి, పిల్లలకు అవగాహన కల్పించే ప్రక్రియ, బోధన పద్ధతులపై ఈ పేస్ టూ శిక్షణలో పి ఓ సంపూర్ణ అవగాహన కల్పించారు. పలువురుతో రంగురంగుల షిట్లలో బొమ్మలు, ఇతర పరికరాలతో కూడిన పిక్చర్స్ కలిగి తక్కువ ఖర్చుతో ఎక్కువగా ఆలోచింపజేసే సృజనాత్మక బోధనా పరికరాలు తయారు చేయటానికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఆకర్షణమైన బోధన చేయాలన్నారు .ఈ సందర్భంగా పలు ఆకృతులను , రంగురంగుల కాగితాలతో తయారు చేయించి చార్టల ద్వారా వాటి అంశాలను వివరింపజేశారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు సునీతా, బాలామణి, కనక మహాలక్ష్మిలు ప్రయోగాత్మకంగా పలు రకాలు కార్యకర్తలతో చేయించారు. మండలంలోని అన్ని సెంటర్ల అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, సిబ్బంది భాను తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టానికి వైసీపీ సైతం రక్షణ ఇవ్వలేదు

విశాలాంధ్ర - జికే వీధి: 1/70 భూబదాలయింపు నిషేధ చట్టానికి వైసిపి కూడా తూట్లు పొడవడానికి చూసిందని వైయస్సార్ కాంగ్రెసు పార్టీకి ఆదివాసీల చట్టాల మీద సదాభిప్రాయమేమీ లేదని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏడుగురు ఆదివాసీ ఎమ్మెల్యేలు షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులకు గృహనిర్మాణాల కోసం ఒకటిన్నర సెంట్ల భూమిని ఇవ్వాలని ముఖ్యమంత్రి కార్యాలయం(సియంఓ)కి లేఖ వ్రాసారు. వైసిపికి చెందిన అప్పటి ఆదివాసి ఎమ్మెల్యే 1/70 చట్టం ఉండటం వల్లే ఏజెన్సీకి పెట్టుబడుల రావడం లేదని అన్నారు. 1/70 చట్టం, పీసా చట్టానికి వ్యతిరేకంగా షిర్డీసాయి ఎలక్ట్రికల్ సంస్థకు చింతపల్లి మండలం ఎర్రవరంలో హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కేబినెట్ నిర్ణయం తీసుకుంది.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తండ్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పాడేరు సభలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులకు గృహ నిర్మాణాలకు సెంటున్నర స్థలం ఇవ్వాలని నిర్ణయించారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా బాక్సైట్ మైనింగ్ తవ్వకాల కోసం చింతపల్లిలో ఆదివాసీలు మాట్లాడడానికి అవకాశం లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ జరిపించారు. తెలుగు దేశం పార్టీ, కూటమి ప్రభుత్వం మాత్రమే కాదు ఆదివాసేతర పార్టీలన్ని 1/70 భూబదాలయింపు నిషేధచట్టానికి వ్యతిరేకమని మరొక్కసారి ఆయన స్పష్టం చేశారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయండి

జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు: మహాశివరాత్రి మత్స్యగుండం జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఐటిడిఏ ఇన్చార్జి ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ డా.ఎం.జి.అభిషేక్ గౌడ అన్నారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో మత్స్య గుండం జాతర మహోత్సవం గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25, 26, 27 తేదిలలో మహాశివరాత్రి జాతరను అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. మత్స్య గుండం సమీపంలో తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్పర్సన్ సర్పంచ్ ఎస్. శాంతకుమారి, ప్రధాన కార్యదర్శి కొండబాబు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - సీతంపేట: గ్రామంలో శనివారం ఉదయం ఈవోపీఆర్డి కే.సత్యం, పంచాయతీ అధికారులు ఆధ్వర్యంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా ఉంచి గ్రామాల్లో, వీధుల్లోకి ప్రతిరోజు వస్తున్న పంచాయతీ ట్రాక్టర్లు, రిక్షాల్లో వెయ్యాలని అవగాహనపరిచారు. స్వచ్ఛభారత్ స్వర్ణ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకొని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీతంపేట పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ "బి" గ్రేడ్

కళాశాల యాజమాన్యాన్ని అభినందించిన కమిషనర్, ఆర్జేడీ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్

విశాలాంధ్ర - పార్వతీపురం/ పార్వతీపురం టౌన్: ఈనెల 12, 13 తేదీలలో పార్వతీపురం మన్యంజిల్లా కేంద్రంలోని ఉన్న శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలను జాతీయ అంచనా గుర్తింపు కౌన్సిల్ (నాక్) ముగ్గురు సభ్యుల బృందం సందర్శించిన తర్వాత కళాశాలకు "బి" గ్రేడ్ ప్రకటించి ఉత్తర్వులు పంపించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. శనివారంనాడు ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో విద్యాప్రమాణాలు, మౌలిక వసతులు, లైబ్రరీ, ల్యాబ్, క్రీడ మైదానం, కళాశాల భవనాలు, భూమి, గత ఐదేళ్లుగా పరీక్షల ఫలితాలు, గత ఐదేళ్లుగా విద్యార్థుల అడ్మిషన్లు, తరగతులు నిర్వహణ, కళాశాలలో ఏర్పాటుచేసిన ఐక్యూఏసి, దానిద్వారా కళాశాలలో బోధనా విధానం, సాంకేతిక విద్యావిధానం ద్వారా బోధన, పూర్వ విద్యార్థులతో ఇంటరాక్షన్, ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు,ఐక్యూఏసి కోఆర్డినేటర్ శాంత కుమారి, వివిధ విభాగాల హెడ్స్ అధ్యాపకులతో ముఖాముఖి, కళాశాలలో ఎన్ సి సి ఎన్ఎస్ఎస్, సేవా కార్యక్రమాలు, రక్తదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రీన్ హౌస్, ప్రకృతి వ్యవసాయసాగు, క్రీడలు, విద్యార్థులు నిర్వహించే సైన్స్ ప్రయోగాలు తదితర అంశాలను కమిటీ రెండురోజులుపాటు క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు చర్చించే కార్యక్రమాన్ని నిర్వహించింది. కమిటీ పరిశీలన తర్వాత నివేదికఇచ్చిన అనంతరం శుక్రవారంనాడు కళాశాలకు బి గ్రేడ్ ప్రకటించినట్లు నాక్ ప్రకటించినట్లు తెలిపారు. కళాశాలకు బి గ్రేడ్ రావడం పట్ల శుక్రవారంనాడు విజయవాడలో జరిగిన ప్రిన్సిపాళ్ళ మీటింగులో కళాశాల కమిషనర్, రీజనల్ జాయింట్ డైరెక్టర్, రీజన్ పరిధిలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్లు శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావును అభినందించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బి గ్రేడ్ ప్రకటించడంపట్ల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి శాంతకుమారి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు ప్రిన్సిపాల్ ను అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు మాట్లాడుతూ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు, పూర్వ విద్యార్థులు, సిబ్బందిసహకారంతో నాక్ బి గ్రేడ్ సాధించడం జరిగిందన్నారు. ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. దీనివలన రానున్న రోజుల్లో కళాశాలలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరచడమే కాకుండా మౌలిక వసతులు కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోనాల విజయ్ చంద్ర సహాయ సహకారాలతో కళాశాలను విశ్వవిద్యాలయస్థాయికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకేంద్రంలో ఎన్డీఏ ఉమ్మడి ప్రభుత్వ సహకారంతో, జిల్లా కేంద్రంలోని పెద్దల సహకారంతో, చేయూతతో, పూర్వ విద్యార్థుల సలహాలతో విశ్వవిద్యాలస్థాయికి చేరుకోవడానికి నిరంతర కృషిచేస్తున్నట్లు తెలిపారు.

వారంలోగా అంగన్వాడీల్లో

మౌలిక వసతులు కల్పించాలి

జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో వారంలోగా మౌలిక వసతుల కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్వాడీల పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మౌలిక వసతులు ప్రారంభంకాని అంగన్వాడీకేంద్రాల్లో తక్షణమే పనులు ప్రారంభం కావాలని, వారంలోగా అన్ని కేంద్రాల్లో వసతులు కల్పించాలని అన్నారు. ప్రతి అంగన్వాడీకి వెంటిలేషన్స్, లైట్లు, రన్నింగ్ వాటర్, ట్యాపులు, టాయిలెట్స్ ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. టాయిలెట్స్ కు రన్నింగ్ వాటర్ ఉండాలని, హేండ్ వాష్ తప్పనిసరని తేల్చిచెప్పారు. రంగులు వేయాలని, వాటర్ ట్యాంకు తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలని తెలిపారు. పూర్తయిన పనులకు సంబందించిన బిల్లులను గ్రామీణ నీటిసరఫరాల విభాగానికి అందజేస్తే చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు. బిల్లులను ఎప్పటికపుడు అప్ లోడ్ చేయాలని, పనులు పూర్తి చేసి, మిగిలిన కేంద్రాల్లో కూడా పనులు చేసుకోవచ్చని తెలిపారు. పిల్లల్లో వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండాలని, దీనిపై సూపర్ వైజర్లు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తెలిపారు. ఫోర్ట్ ఫైడ్ రైస్ పంపిణీ జిల్లాలో బాగుందని కితాబిస్తూ, ఈ రైస్ వలన కలిగే ప్రయోజనలను ప్రజలకు వివరించాలని అన్నారు. బాల్య వివాహాలు జిల్లాలో జరగడానికి వీల్లేదని, బాల్య వివాహాలు చేయమని తల్లితండ్రుల నుంచి డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. డిక్లరేషన్ డ్రైవ్ చేపట్టి వచ్చే నెలాఖరులోగా పూర్తిచేయాలని అన్నారు. డ్రాప్ అవుట్స్ చిల్డ్రన్స్ గుర్తించి పాఠశాలలో చేర్పించాలని చెప్పారు. కిచెన్ గార్డెన్ తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అందించే ఇంటికే రేషన్ ను సకాలంలో అందజేయాలని అన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని వారికి ముందుగా అందాలని, జాప్యం జరిగితే సహించబోమని అన్నారు. అనంతరం బాల ఆధార్ సీడింగ్ పై మాట్లాడుతూ ఆధార్ నమోదులో జిల్లా ముందంజలో ఉండాలని అన్నారు. బరిష్ లేకపోయినా బాల ఆధార్ నమోదు చేసుకోవచ్చని, కావున దానిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నిర్దేశించిన లక్ష్యాలలో వెనుకంజలో ఉన్న ఐదుగురు సీడీపీఓలకు ఛార్జ్ మెమో లు జారీచేస్తామని, కావున అందరూ శ్రద్ధగా పనిచేయాలని కలెక్టర్ హితవు పలికారు. ఈసమావేశంలో జిల్లా మహిళా, శిశుసంక్షేమఅధికారి టి. కనకదుర్గ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు, సీడీపీఓలు,సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రఘువర్మకు తొలిప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పార్వతీపురం/ బెలగాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు తొలిప్రాధాన్యత ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర కోరారు. శనివారం నాడు పట్టణంలో పలు విద్యాసంస్థలలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం,విద్యా విధానం బలోపేతానికి రఘువర్మ మరింత దోహదపడతారని, ఆయన్ని అత్యధిక మెజార్టీతో చట్టసభకు ఎన్నుకోవాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు బొడ్డు పైడిరాజు, టిడిపి నాయకులు పట్టణ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్,కోలా మధు, కౌన్సిలర్స్ కోరాడ నారాయణరావు, దివ్య, జయంతి, ఆనంద్, బడే గౌరు నాయుడు, మంత్రిన రవికుమార్, పట్టణ టిడిపి కన్వీనర్ మజ్జి వెంకటేష్, గణేష్, భాస్కర్ రావు, గ్రంధి రామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతాం

విశాలాంధ్ర - పార్వతీపురం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, శాసన సభ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తరువాత పార్వతిపురం పురపాలక సంఘం చైర్మన్ పై అవిశ్వాస తీర్మానంను ప్రవేశ పెడతామని ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. శనివారం అసెంబ్లీ సమావేశాలకు బయలుదేరేముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ, ఎన్డీఏ ఉమ్మడి ప్రభుత్వ అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి పార్వతిపురం పురపాలకసంఘంలో పలువురు కౌన్సిలర్లు వైసీపీ నుండి టీడీపీలో రెండుసార్లు విజయ్ చంద్ర సమక్షంలో చేరిన సంగతి తెలిసిందే. మరికొంతమంది కౌన్సిలర్లు త్వరలో పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన తర్వాత మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థిని ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. పురపాలక సంఘంలో పలుమార్పులు జరగడం తధ్యమని తెలిపారు.

అంతర్రాష్ట్ర మెగా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర - మోతుగూడెం: అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెం క్రికెట్ క్రీడా మైదానంలో శనివారం మోతుగూడెం గ్రామానికి చెందిన దూల్లారి గోపి తల్లిదండ్రుల (లక్ష్మి, భగత్ రామ్) జ్ఞాపకార్థం అంతర్రాష్ట్ర మెగా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఏఎస్పీ పంకజ్ కుమార్ మీన, సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ వాసుదేవరావు, డిఈ బాలకృష్ణ, ఎస్ఈ కామేశ్వరరావు, మోతుగూడెం ఎస్.ఐ.శివ నారాయణ, డిఏవి స్కూల్ ప్రిన్సిపల్ రఘురాం ముఖ్య అతిథులుగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలలో మొత్తం 44 జట్లు పాల్గొంటున్నాయని, పోటీలు 15 రోజులు పాటు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ టోర్నమెంట్లో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు యాభై వేల రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు ఇరవై ఐదు వేల రూపాయలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు పది వేల రూపాయలు బహుమతి ఉంటుందని తెలియజేశారు. మొదటి మ్యాచ్ డొంకరాయి, పప్పులూరు జట్లు తలపడగా డొంకరాయి జట్టు విజయం సాధించింది.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడం ఆనందదాయకం

విశాలాంధ్ర - చింతపల్లి: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని స్థానిక తెదేపా నాయకులు అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు భూషణం, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ లు అన్నారు. శనివారం వారు ఏరియా ఆసుపత్రిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక ను మర్యాదపూర్వకంగా కలిసి, నాగభూషణం స్వయంగా తయారుచేసిన సూపరింటెండెంట్ నేమ్ బోర్డ్ తో ఉన్న మెమెంటో ను ఈ సందర్భంగా ఆమెకు బహుకరించారు.

అనంతరం వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడం ఆనందదాయకమన్నారు. రోగుల సమస్యలు పూర్తి స్థాయిలో అడిగి తెలుసు కొని వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించడం సంతోషకరమన్నారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు..

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారిణి మంజుల వీణ

విశాలాంధ్ర - పార్వతీపురం/బెలగాం : పరీక్షలు దగ్గర పడ్డాయని విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ర్యాంకులు, మార్కులపై అపోహలు వీడి ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి మంజుల వీణ పేర్కొన్నారు. మార్చి 1 నుంచి ప్రారంభంకానున్న పరీక్షల హాల్ టికెట్లు వాట్సాప్ లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 82 కళాశాలలకు చెందిన 17,849 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, వీరి కోసం 34 కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని, 500 మంది ఇన్విజిలేటర్లు, 34 మంది చొప్పున పర్యవేక్షకులు, డిపార్టుమెంట్ అధికారులు, ఇద్దరు చొప్పున సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, ప్రశ్నపత్రాల కోసం 15 స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేశామని, జిల్లా, రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూంల నుంచి సిసి కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజు బకాయిల కోసం విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, హాల్ టికెట్లు నిలిపి వేస్తే సదరు కళాశాల గుర్తింపు రద్దు చేస్తామని, పరీక్షల సమయంలో వారిపై ఒత్తిడి తగ్గించేలా చూడాలని అన్ని కళాశాలల యాజమాన్యాలను ఆదేశించామని పరీక్షలు, ఫలితాల సమయంలో వారిలో మానసిక స్థైర్యం నింపాలని, మంచి ఆహారం అందిస్తూ సరిపడా నిద్ర ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థులకు ప్రస్తుతం హాల్ టికెట్లు జారీ చేస్తున్నామని, నెట్ సెంటర్లతో పాటు వాట్సాప్ ద్వారా సులభంగా డౌన్లోడ్ చేసుకోవచ్చునని 95523 00009 నంబరుకు హాయ్ అనే సంక్షిప్త సందేశం పంపించి హాల్ టికెట్ పొందవచ్చునని, ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా నేరుగా పరీక్షకు హాజరుకావచ్చునని, సాంకేతిక సమస్యలుంటే జిల్లా కంట్రోల్ రూం 88977 88769 నంబరుకు సమాచారం ఇవ్వొచ్చని, కళాశాలల్లోనూ హాల్ టికెట్లు జారీ చేస్తున్నామని తెలిపారు.

అల్లూరి విగ్రహానికి జాతీయ రహదారి గ్రహణం

కూలీలను పెట్టి విగ్రహాన్ని భద్రంగా తీయిస్తున్న జెడ్పీటీసీ



విశాలాంధ్ర - చింతపల్లి: నాటి చింతపల్లి శాసనసభ్యుడు స్వర్గీయ గొడ్డేటి దేముడు హయాంలో స్థానిక హనుమాన్ కూడలిలో ఉన్న మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జాతీయ రహదారి గ్రహణం పట్టింది. ఇంతకాలం జయంతి, వర్ధంతి కార్యక్రమాల సమయంలో సుందరీకరణ పనులతో అందంగా దర్శనమిచ్చిన అల్లూరి సీతారామరాజు విగ్రహం ఈమధ్య కాలంలో మన్యంలో జరుగుతున్న జాతీయ రహదారి 516 విస్తరణ పనుల కారణంగా నిరాదరణకు గురైంది. జాతీయ రహదారి విస్తరణ నిర్మాణ పనులు హనుమాన్ కూడలి మీదుగా వెళుతుండగా అల్లూరి విగ్రహం ఉన్న స్థలం కూడా ఈ విస్తరణ లో భాగంగా తొలగించవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో విగ్రహాన్ని ఆ స్థలం నుండి వేరే స్థలానికి మార్చవలసిన అవసరం ఏర్పడింది. దీంతో నిరాదరణకు గురైన విగ్రహం రహదారి విస్తరణ కారణంగా దుమ్ము పట్టిపోవడమే గాక, కృంగే పరిస్థితికి చేరింది. ఈ విషయం పలు దినపత్రికలలో ప్రచురితం కావడంతో స్థానిక జడ్పీటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య కూలీలను ఏర్పాటు చేసి అల్లూరి సీతారామరాజు విగ్రహానికి అక్కడ నుంచి భద్రంగా తొలగించి మరో చోట ప్రతిష్టించే వరకు సురక్షితమైన ప్రదేశంలో పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు చేసేవారు నష్టపరిహారం కింద అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కొయ్యూరు వారి బ్యాంకు ఖాతాలో కొంత సొమ్ము జమచేసారని ఆ సంఘ అధ్యక్షులు శ్యామల వరలక్ష్మి చెప్పారనీ అయితే ఎంత సొమ్ము జమ చేసారో తెలియదన్నారు.ఆసంఘ అధ్యక్షులు, సభ్యులతో కలిసి జాయింట్ కలెక్టర్ ను సంప్రదించి చింతపల్లి లో 20 సెంట్ల ప్రభుత్వ భూమి ఇస్తే అందులో ఈ అల్లూరి విగ్రహం తో పాటు మన్యం విప్లవ వీరుల విగ్రహాలు పెట్టి సందర్శకులకు అహ్లాదకరంగా ఉండేలా చేస్తామని కోరామని, దానికి సదరు జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఈ సందర్భంగా బాలయ్య తెలిపారు. ఇది జరిగి సుమారు ఆరు నెలల పైనే అవుతుందని, కానీ ఆ పని కార్యరూపం దాల్చలేదన్నారు.ఇప్పుడు ఈ విగ్రహాన్ని మండల పరిషత్ కార్యాలయం ముందు ఉన్న ఖాళీ స్థలంలో దిమ్మ నిర్మించి పది రోజుల లోగా ఆ విగ్రహాన్ని అక్కడ ప్రతిష్టిస్తామన్నారు. ఈ విషయంలో కొంత జాప్యం జరిగిందని, ఏది ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరవరానివనీ, వారి త్యాగాల ఫలితంగానే మన్యవాసులమంతా స్వేచ్ఛాయుత జీవితం గడుపుతున్నామని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

పోటీ ప్రపంచంలో నేటి యువత

అన్ని రంగాల్లోనూ ముందుండాలి

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వంపురు గంగులయ్య

విశాలాంధ్ర - పాడేరు: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ముందుండాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వంపూరి గంగులయ్య అన్నారు. శనివారం శ్రీ గౌతమీ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న "యాన్యువల్ స్పోర్ట్స్ మీట్" ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల చైర్మన్ తామర మాణిక్యం, కరస్పాండెంట్ బుద్ధ తులసీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ దాడి వెంకటశివతో పాటుగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు గంగులయ్యకి పుష్పగుచ్ఛాలిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థులే కరువయ్యేవారని, కూటమి పరిపాలనతో నేడు అటువంటి పరిస్థితి లేదన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి విద్యార్థి ఇప్పటినుండే మంచిగా చదవాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు తన చేతులమీదుగా మెడల్స్, సర్టిఫికేట్లు అందజేసి విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.అంతకుముందు పాఠశాల యాజమాన్యం గంగులయ్య ని దుశ్శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై ఫోక్సో కేసు

విశాలాంధ్ర - సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మండంగి నాగేశ్వరరావు, పత్తిక త్రినాధరావు వాచ్‌మెన్ ఇరువురు పాఠశాలలో చదువుతున్న కొంతమంది విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని బాలికల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందని సబ్ ఇన్స్పెక్టర్ అమ్మనరావు తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - కొమరాడ: ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కొమరాడ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం కునేరు గ్రామంలో నిర్వహించారు. పిహెచ్సీ వైద్యులు, జిల్లా ఆసుపత్రి, ఇండస్ ఆసుపత్రి వైద్య నిపుణులు శిభిరంలో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, ఎస్సై కే.నీలకంతం ప్రారంభించారు. శిబిరంలో అందజేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అందజేసిన చికిత్సా వివరాలు అక్కడ వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన మందులు, వివిధ రకాల పరీక్షలు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ పోలీస్ శాఖ వారు తదితర శాఖల సమన్వయంతో గిరిజన ప్రాంత ప్రజలకు మెగా వైద్య శిబిరం ద్వారా వైద్య సేవా కార్యక్రమం చేపట్టడం మంచి ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా. శామ్యూల్, డా.గణేష్, డా. అరుణ్, వైద్య నిపుణులు డా.హరి జగన్, డా.వంశీ కృష్ణ, డా. సౌజన్య, డా.రాహుల్, మేనేజర్ బి.అప్పలనాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర - గంగవరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎస్ ఎస్ టి బృందం అధికారులు గంగవరం వై జంక్షన్‌లో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కే.విశ్వనాథ్, పోలీస్ శాఖ నుంచి ఏఎస్ఐ. సూర్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు తరలింపును అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఈ తనిఖీలు నిర్వహిస్తుందని వారు తెలిపారు.

నేడు జాబ్ మేళా

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్; స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణ పరిధిలో ఆదివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్థానిక డిపో మేనేజర్ ఈఎస్‌కె దుర్గ తెలిపారు. తగరపువలస ప్రాంతము వైజాగ్‌లో పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ నియామకం కొరకు 10వ తరగతి పాస్ అయి 35 లోపు వయస్సు గలవారు అర్హులన్నారు. వసతి భోజనం ఉచితముగా కల్పిస్తూ వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆదివారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ఇతర వివరాలకు 9866602848, 9290800336 సంప్రదించాలన్నారు.

ఎన్.ఆర్.సీ కేంద్రంలో ప్రత్యేక వైద్య సేవలు



విశాలాంధ్ర - కూనవరం: కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌నందు ఉన్న ఎన్.ఆర్.సీ కేంద్రంలో పౌష్టికాహార లోపం, బరువు తక్కువతో ఉన్న పిల్లలు, రక్త హీనతో బాధపడే పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలతో పాటు ప్రతీ రోజు మంచి పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందని సూపరింటెండెంట్ కె.మహేష్ బాబు తెలిపారు. కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల పరిధిలో ఉన్న గ్రామాలలోని అంగన్వాడి కేంద్రాలలో పని చేస్తున్న కార్యకర్తలు, ఆయాలు స్థానికంగా ఇలాంటి లోపంతో ఉన్న వారిని గుర్తించి కోతులగుట్ట ఎన్.ఆర్.సీ కేంద్రానికి పంపించాలని కోరారు. ఇలాంటి లోపాలతో ఉన్న పిల్లలకు ప్రతీ రోజు వైద్య సేవలు అందించడం జరుతుందని తెలిపారు. అలాగే రోజుకు వారి తల్లిదండ్రులకు భోజన వసతి తో పాటు ప్రతీ రోజు వంద రూపాయలు ఇన్సెంటివ్ కూడా అందజేయడం జరుతుందని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఈ సేవలు పొందాలని సూపరింటెండెంట్ డా. మహేష్ బాబు సూచించారు.

మంచినీటి బోర్లు మరమ్మతులు చేపడతాం

విశాలాంధ్ర - కొమరాడ: గిరిజన గ్రామాల్లో రానున్న వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని గిరిజన గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోర్లలో శనివారం వానబడి తీలేసు సర్వపాడు మరికొన్ని గిరిజన గ్రామాల్లో గ్రామీణ నీటి సరఫరా ఏఈ జి.గౌరు శంకర్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామాలు ప్రజలతో మాట్లాడుతూ త్వరలోనే బోర్లు మంచినీటి కొళాయి ఎక్కడైనా మరమ్మతులు అయితే వెంటనే మరమ్మతులు చేపట్టి అలాగే మరికొన్ని కొత్త బోర్ వెల్స్‌కు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్ ఆనంద్ గ్రామ సచివాలయ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

పీసా చట్టం అమలుకు కమిటీలు కృషి చేయాలి

విశాలాంధ్ర - కొయ్యూరు: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన పీసా చట్టం అమలులో నూతన కమిటీ సభ్యులు షెడ్యూల్ ప్రాంతాల్లో ప్రజల స్వయం పాలనకు దోహద పడేలా దృఢ సంకల్పంతో సేవా దృక్పథంతో పని చేయాలని మండల అభివృద్ధి అధికారి ఎస్‌కెవి ప్రసాద్ అన్నారు. గతవారం రోజులుగా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, నూతన పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఎంపీటీసీ, ఇతర డ్వాక్రా, వెలుగు తదితర మహిళాలకు అందించిన పేసా చట్టం అమలుపై కల్పించిన శిక్షణ తరగతులు నేటితో ముగిశాయి. ఈ ముగింపు సమావేశంలో ఎంపీడీవో ఎస్ కె వి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పీసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఇందుకు నూతన కమిటీ లు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేస్తూ ముందుకు

నడిచినప్పుడే ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎస్ ఐ ఆర్డి డిప్యూటీ డైరక్టర్ జె. రామనాధం మాట్లాడుతూ పేసా గ్రామ సభలకు ప్రత్యేక అధికారాలు కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు గిరిజనులకు పూర్తి స్థాయిలో అందించేందుకు ప్రతి కమిటీ కృషి చేయాలని కోరారు. ఈ ముగింపు కార్యక్రమంలో ఎంపీడీవో , ఏ ఒ,ఈఒపిఆర్డి, ఎం ఓటీ లకు, ఆఫీస్ సిబ్బందికి డిప్యూటీ డైరక్టర్ రామనాదం అభినందనలు తెలిపారు.

ఈ శిక్షణలో అనంతరం శిక్షణ పొందిన వారిచే ఫీడ్బ్యాక్, ఆన్లైన్ ద్వారా క్విజ్ నిర్వహించన వారికి కార్యక్రమంలో పాల్గొన్న వారికి తగిన సర్టిఫికెట్స్ అందించి అభినందనలు తెలిపారు. ఈ శిక్షణ కు వారం రోజుల పాటు పూర్తి సహకారం అందించిన డిజిటల్ అసిస్టెంట్ కె. ప్రసాద్ (అంతాడ) ఇతర సిబ్బందికి సంబధిత అధికార్లు ప్రత్యేక అభినందలు తెలియజేసారు.

జీవో నెంబర్ 3పై అసెంబ్లీలో చర్చించాలి

విశాలాంధ్ర - సీతంపేట: పాలకొండ నియోజకవర్గం శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ కు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ తరఫున ఈరోజు షెడ్యూల్ ప్రాంతంలో జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని కోరుతూ 24వ తేదీ నుండి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని ఆదివాసి గిరిజన సంఘం

నాయకులు, పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణకు వినతిపత్రం అందించారు. జీవో నెంబర్ 3 ఏజెన్సీలో ఉండేటప్పుడు 19ప్రభుత్వ శాఖలు, 34 రకాల ఉద్యోగ అవకాశాలు ఆదివాసీలకు హక్కుగా ఉండేది అన్నారు. జీవో నెంబర్ 3 రద్దు అవడంతో ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయింది అన్నారు. 24వ తేదీన అసెంబ్లీ సమావేశంలో ఈ విషయాలు ప్రస్తావించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మణరావు కోరారు. అదేవిధంగా గిరిజన అటవీ ఉత్పత్తులు జీడిమామిడి, చింతపండు , చీపుర్లు తదితర ఉత్పత్తులు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని తెలియజేయమని కోరారు. నాన్ షెడ్యూల్ గ్రామాలు షెడ్యూల్ ప్రాంతంలో చేర్పి పించాలని, అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించాలని కోరారు. ఆదివాసీలకు మెగా డిఎస్సి ఈ మధ్యకాలంలో విడుదల చేశారు. ఆదివాసీలు స్పెషల్ డిఎస్సి ప్రకటించాలని కోరారు. ఈ సమస్యలన్నీ అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించాలని, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా బృందం వెళ్లి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సవర గంగయ్య పాల్గొన్నారు.

14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర - బెలగాం : 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని జిల్లా సహాయ కార్మిక అధికారి సిహెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు. కార్మిక చట్టాల అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ దుకాణాల వద్ద పోస్టర్లను పంపిణీ చేసి అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వృత్తిలోనైనా, ఏ ప్రక్రియలో అయినా 14 సంవత్సరాల లోపు బాల బాలికలను పనిలో పెట్టుకోవడం పూర్తిగా నిషేధించడం జరిగిందని అన్నారు. బాలల హక్కులను పరిరక్షించడానికి, వారి భవిష్యత్తును కాపాడడానికి బాల, కౌమార కార్మిక వ్యవస్థ (నిషేధ మరియు నియంత్రణ) చట్టం -1986, (సవరణ చట్టం - 2016) చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. సెక్షన్ 3, సెక్షన్ 3 ఎ ప్రకారం 14 -18 సం. వయసులో ఉన్న వారి చేత నిర్దేశిత ఎ, బి షెడ్యూలులో పేర్కొన్న నిషేధిత ప్రమాదకర వృత్తులు, ప్రక్రియలలో పనిచేయించుకోవడం లేక పనిలోకి అనుమతించిన వారికి రూ .20 వేల నుండి 50 వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సెక్షన్లను ఉల్లంఘించిన వారికి 6 నెలల నుండి 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని సూచించారు. బాల కార్మికుల గురించి ఫిర్యాదును చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నెంబరు కు తెలియ జేయవచ్చని వివరాలకు సంప్రదించగలరని ఆయన వివరించారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం

జిల్లా రవాణాశాఖాధికారి దుర్గాప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలోని లారీ, ఆటో, మాక్స్ కాబ్, టాక్సీ కాబ్, ఇతర రవాణా వాహనాల్లో అతివేగం, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించి తీసుకువెళ్లడం వలన జరిగే ప్రమాదాలపై వాహన యజమానులు, డ్రైవర్లకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖాధికారి టి.దుర్గాప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆటోలు, లారీలు మితిమీరిన వేగంతోపాటు పరిమితికి మించి ప్రయాణి కులతో వెళ్ళడంవల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తద్వారా అధిక శాతం ప్రమాదాలు బారినపడుతున్నారని, అలాగే అంతర్రాష్ట్ర రహదారిపై మితిమీరిన లోడులతో భారీ వాహనాలు అతివేగంగా వెళ్ళడంతో అనేకసార్లు ప్రమాదం జరిగి ఎంతోమంది మృతి చెందే పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి ప్రమాదాల నివారణ కొరకు జిల్లాలోని రవాణా శాఖ ఇంధన మరియు సహాయ ఇంధన శకట తనిఖీ దారులతో ఎప్పటికప్పుడు అన్ని రకాల వాహన యునియన్స్ (లారీ, ఆటో, మాక్స్ కాబ్, టాక్సీ కాబ్ మరియు ఇతర రవాణా వాహనాల)తో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించడం, అధిక వేగంతో వాహనాలను నడపడం వలన కలిగే రహదారి ప్రమాదాలపై వివరించడం జరుగుతుందన్నారు. అలాగే రవాణా శాఖ తనిఖీదారులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 2024 సం. అక్టోబర్ నుంచి ఇప్పటివరకు పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించిన 355 వాహనాలపై కేసులు పెట్టి సుమారు రూ.2 లక్షల 80 వేలు అపరాధ రుసుమును విధించినట్లు చెప్పారు. అదేవిధంగా రహదారి భద్రత నియమాలు ఉల్లంగించిన వాహనాల డ్రైవర్స్ కు సంబంధించి 97 డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేసామన్నారు. ఈఏడాది జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా అవగాహన కల్పించడమే కాకుండా సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు . పరిమితికి మించి ప్రయాణికులను తీసుకొని వెళ్తున్న వాహనాలపై ప్రతేక తనిఖీలు నిర్వహించి యజమానులకు,డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

విద్యార్థినిల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య ధోరణి సరికాదు

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: గిరిజన ఆశ్రమ పాఠశాలలో కొలువుంటూ విద్యను అభ్యసించి విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఆశ్రమ పాఠశాల నిర్వహణ కులు నిర్లక్ష్య ధోరణి అవలంబించడం సరికాదని, విద్యార్థుల తల్లిదండ్రులు మండల, ప్రజా ప్రతినిధులు ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నారు. అనారోగ్య పాలైన నలుగురు విద్యార్థునిలకు వైద్య చికిత్సలు అందించడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నంది వలస బాలికల ఆశ్రమ పాఠశాలలోనీ చదువుకునే కే.ఆసియా పదో తరగతి, పి రాధమ్మ 9వ తరగతి, కొర్ర .పార్వతి, తొమ్మిదో తరగతి జి పవిత్ర ఎనిమిదో తరగతి, అనే విద్యార్థులు పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో నందివలస ఆశ్రమ పాఠశాల నిర్వాకులు విద్యార్థులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి వైద్య పరీక్షలు నిర్వహించాల్సిపోయి విద్యార్థులకు ఆటో చార్జీలు ఇచ్చి మండల కేంద్రంలో గల పిహెచ్సిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని పంపించినట్లు అవి విద్యార్థులు తెలిపారు. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం ఎనిమిది గంటల సమయంలో వచ్చిన విద్యార్థులకు మధ్యాహ్నం భోజన ఏర్పాటు లేకపోవడంతో స్థానిక

పీహెచ్సీ ఓపి ప్రాంగణంలోనే మధ్యాహ్నం మూడు గంటల 8 నిమిషాల వరకు మండుటెండలో విద్యార్థుల నిరీక్షణ చెయ్యక తప్పలేదు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఆశ్రమ పాఠశాల నిర్వాహకుల పై పలువురు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి సందర్భాలు ఆశ్రమ పాఠశాల కులవల్లే ఏర్పడుతుందని విద్యార్థులు తల్లిదండ్రులు మండల ప్రజలు చెబుతున్నారు. విద్యార్థుల సమస్యను తెలుసుకున్న స్థానిక పిహెచ్సి వైద్యాధికారి విద్యార్థులను అడిగి తెలుసుకుని అంబులెన్స్ ఏర్పాటు చేసి నంది వలస ఆశ్రమ పాఠశాలకు అంబులెన్స్ ద్వారా తరలించారు.

రఘువర్మ గెలుపునకై ప్రచారం

విశాలాంధ్ర - చింతపల్లి: ఈ నెల. 27న జరుగనున్న, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలికి పోటీచేస్తున్న ఏపీటీఎఫ్ ఇతర అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘు వర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించ వల్సిందిగా లంబసింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల, తాజంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల, జాజులపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ వసతి గృహ పాఠశాల, అంజలి శనివారం గురుకుల పాఠశాల, పెద బరడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ వసతి గృహ పాఠశాలలలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల అమూల్యమైన ఓటుని మొదటి ప్రాధాన్యత ఓటుగా వేసి గెలిపించవల్సిందిగా కోరటం జరిగింది. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిల్లో పూర్ణ చందరావు, ప్రధాన కార్యదర్శి ఆంద్రాబు లక్ష్మణ్, తెలుగుదేశం పార్టీ నాయకులు శ్యామ్ సుందరావు, పురుషోత్తం , చెన్న కేశవ, నూకరాజు,, యస్వంత్, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'బిజినెస్ లీడర్ అఫ్ ది డికేడ్' అవార్డును అందుకున్న సజ్జన్ జిందాల్

విశాలాంధ్ర- పాడేరు: జె ఎస్ డబ్ల్యు గ్రూప్‌ను బహుళజాతి సంస్థగా విస్తరించడంలో ఆయన చూపిన పరివర్తన నాయకత్వానికి గుర్తింపుగా, జేయస్ డబ్ల్యు గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్‌కు 15వ ఏఐఎంఏ మేనేజింగ్ ఇండియా అవార్డులలో బిజినెస్ లీడర్ అఫ్ ది డికేడ్ (దశాబ్దపు వ్యాపార నాయకుడు) గౌరవం లభించింది. ఈ అవార్డును ఈరోజు ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గౌరవ అతిథి వాణిజ్యం , పరిశ్రమలుబీ ఎలక్ట్రానిక్స్ , ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమక్షంలో జిందాల్‌కు ప్రదానం చేశారు. ఈ ప్రశంసా పత్రాన్ని కే పి ఎం జి ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ యెజ్దినాగ్‌పోర్‌వాలా చదివారు. జిందాల్ నాయకత్వంలో జే ఎస్ డబ్ల్యు గ్రూప్ అద్భుతమైన వృద్ధిని సాధించింది.

పెద్దల సభలో సమస్యలు పరిష్కరించేది పీడీఎఫ్ అభ్యర్థులే

విశాలాంధ్ర - చింతపల్లి: పెద్దల సభలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేది పీడీఎఫ్ అభ్యర్థులు మాత్రమేనని మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీఎస్. శర్మ అన్నారు. పిడిఎఫ్ అభ్యర్థిని కోరెడ్ల విజయ గౌరీ కి మద్దతుగా ప్రచార కార్యక్రమంలో భాగంగా చింతపల్లి వచ్చిన ఆయన స్థానిక ప్రెస్ క్లబ్ లో పాత్రికేయులతో మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత

ఓటు పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి వేయాలని కోరారు. రాష్ట్రంలో గత ఏడేళ్ల కాలంలో 35 వేలమంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందారని, తక్కువ సంఖ్యలో మెగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతానికి స్పెషల్ డీఎస్సీని ప్రకటించాలన్నారు. కార్పోరేట్ సంస్థ మనిషిని మంత్రివర్గంలో పెట్టుకుని ప్రభుత్వ విద్యను బాగుచేసే శక్తి ఈ ప్రభుత్వానికి ఎక్కడనుంచి వస్తుందని విమర్శించారు. విద్యారంగం తరుపున ప్రశ్నించే పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జనవిద్యాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సులభతరంగా పదవీ విరమణ ప్రణాళికలు

విశాలాంధ్ర - పాడేరు: నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) కోసం భారతదేశంలో అతిపెద్ద సెంట్రల్ రికార్డ్ కీపింగ్ ఏజెన్సీ (సి ఆర్ ఏ) అయిన ప్రోటీన్ ఈ గావ్ టెక్నాలజీస్ తమ పెన్షన్ నిర్వహణ యాప్(ఎన్ పీ ఎస్ ప్రోటీన్")ను విస్తరించింది. నేటి డిజిటల్ అవగాహన ఉన్న తరం కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన అనేక కొత్త ఫీచర్లతో ఎన్ పీ ఎస్ బై ప్రోటీన్' ను అప్డేట్ చేసిందని ఈ గోవ్ టెక్నాలజీస్ హెడ్ సురేష్ సేథి తెలిపారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో సాంకేతిక మార్గదర్శకులు ఇప్పటికే ఎన్ పీ ఎస్ పెట్టుబడిదారు అయినా లేదా పదవీ విరమణ ప్రణాళిక ప్రయాణాన్ని ప్రారంభించినా, ఈ యాప్ ఏకీకృత పరిష్కారంగా నిలుస్తుందన్నారు. ఆండ్రాయిడ్ ఐఓఎస్ వినియోగదారులకు అందుబాటులో ఉన్న ఈ యాప్, సహజమైన నావిగేషన్ మరియు మెరుగైన భద్రతా లక్షణాలను అందిస్తుందన్నారు. ఎన్ పీ ఎస్ ఖాతాలను నమోదు చేసుకోవడం, సహకరించడం మరియు నిర్వహించడం గతంలో కంటే సులభతరం చేస్తుందని చెప్పారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మను గెలిపిద్దాం

విశాలాంధ్ర - పాడేరు: రాబోయే శాసనమండలి ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని పాకలపాటి రఘువర్మ ను గెలిపించుకుందామని పాడేరు ఎన్డీఏ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శనివారం మండలంలో గల నెంబర్ పాఠశాల, శ్రీకృష్ణాపురం బాలికల పాఠశాల కస్తూర్బా బాలికల పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి రఘు వర్మను ఎమ్మెల్సీగా గెలిపించుకుందామని, ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని నిర్మూలించడానికి, ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడటానికి తాను సరైన వ్యక్తి అన్నారు. ఉత్తరాంధ్రకు

సంబంధించిన సమస్యల కోసం గత వైసిపి ప్రభుత్వంతో పోరాడారని అన్నారు. ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు మధ్య అంతరాన్ని తగ్గించగల నిజాయితీపరుడైన అభ్యర్థి రఘువర్మ అని అన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడంలో తాను కీలక పాత్ర పోషించానని గుర్తు చేశారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు అభ్యర్థికి ఖచ్చితంగా మద్దతు ఇస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ రాజమండ్రి నారాయణ, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొర్రా విజయ రాణి,తెలుగు యువత నియెజకవర్గ అధ్యకులు దప్పోడి వెంకటరమణ, పాడేరు సూపర్ జడ్పీటీసీ విశ్వ, పాడేరు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బుక్క జగదీష్,మాజీ సర్పంచ్ రేగం కొండబాబు కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

విశాలాంధ్ర - చింతపల్లి: అక్రమంగా తయారు చేస్తున్న నాటు సారా బట్టీలపై రైడ్ చేసి నాలుగు వందల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె.కూర్మారావు అన్నారు. నవోదయం -2లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని వివిధ

ప్రాంతాలలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా రౌ రింతాడ గ్రామ సమీపంలోని మారుమూల ప్రాంతాలలో రహస్యంగా వండుతున్న నాటు సారాయిని బట్టీలను ధ్వంసం చేయడం జరిగిందని, తమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం నాటు సారా బట్టీల నిర్మూలనకై కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఈరోజు (శనివారం) రవ్ రింతాడ గ్రామ సమీపంలో నాటు సారా తయారీకి అక్రమంగా నిల్వ చేసిన 400 లీటర్ల బెల్లపు ఊట ను ధ్వంసం చేయడంతో పాటు ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఆ శాఖ హెడ్ కానిస్టేబుల్ కుమార్, కానిస్టేబుళ్లు శివ, నాయుడు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర - జీకే వీధి: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని తాసిల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. శనివారం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ జీకేవీధి బాలికల ఆశ్రమ పాఠశాలలో పోలింగ్ కేంద్రం నెంబర్ 88 వద్ద పోలింగ్ సిబ్బంది కోసం వసతి ఏర్పాట్లు పూర్తి చేసామని తెలిపారు. మండలంలో మొత్తం 117 మంది ఓటర్లు ఉండగా అందులో 63 మంది పురుష, 54 మంది మహిళ ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు. ఈనెల 27వ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక రోజున ఉపాధ్యాయ ఓటర్లందరికి అందరికీ ప్రత్యేక క్యాజువల్ లీవులు ప్రభుత్వం ప్రకటించిందని అందరూ పోలింగ్ బూత్ వద్ద ఓటును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల రోజు ఎంపీడీవో ఆధీనంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు తావు లేకుండా పోలింగ్ బూత్ ప్రాంగణమంతా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల సందర్భంగా ఈనెల 25 నుండి 28 వరకు ఇటువంటి మద్యం అమ్మకాలు చేపట్టకూడదని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్ సీనియర్ అసిస్టెంట్ చిన్నయ్యపడల్, వీఆర్వోలు లింగాలు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మన్యం గాయకుడు దుడ్డు సత్యనారాయణ సేవలు గిరిజనానికి అవసరం

విశాలాంధ్ర - చింతపల్లి :- నిస్వార్థ సేవకు నిదర్శనంగా మన్యం గాయకుడు దుడ్డు సత్యనారాయణకి ఢిల్లీ గౌరవ డాక్టరేట్ ఇవ్వడం సంతోషదాయకమని చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జల్లి హలియా రాణి, వైకాపా ఎస్ టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్ లు అన్నారు.

శనివారం చింతపల్లి వచ్చిన ఆయనను సుధాకర్, హలియా రాణి దంపతులు వారి స్వగృహంలో మాజీ ఎంపీపీ బాబురావు తో కలసి డాక్టరేట్ గ్రహీత దుడ్డు సత్యనారాయణ ను దుశ్శాలువా తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంతతిలో అనేక రకాల ప్రతిభ గల వారు ఉన్నారన్నారు. గిరిజన జాతి దేనికి తీసిపోదని, ఏ రంగంలోనైనా రాణిస్తుందన్నారు. ఎంతో ఉదార స్వభావంతో గ్రామ సమస్యలను, మండల సమస్యలను అధికారులకు తెలియజేయడమే కాకుండా పాట రూపంలో కూడా అందరికీ వినసొంపుగా తెలియజేయడం దుడ్డు సత్యనారాయణకే దక్కుతుందన్నారు. తనకున్న ప్రతిభతో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా ఆయనను కొనియాడారు. చేసే ప్రతి పనిలో వ్యయ ప్రయాసల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో దుడ్డు సత్యనారాయణ బృందం సభ్యులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తికి అస్వస్థత

విశాలాంధ్ర - బెలగాం: గడ్డిమందు తాగి వ్యక్తికి అస్వస్థతకు గురైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే సీతానగరం మండలం గెడ్డలుప్పి గ్రామానికి చెందిన చొంగల క్రిష్ణమూర్తి భార్య బంగారమ్మ తెలిపిన వివరాల మేరకు క్రిష్ణమూర్తి చాలా కాలంగా మెడనొప్పి రెండు భుజాలు నొప్పితో బాధపడుతున్నాడు. గత మూడు రోజులుగా నొప్పిని భరించలేక చనిపోవాలని నిర్ణయం తీసుకొని గడ్డిమందు తాగాడు. దీనితో కొద్దిసేపటికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే 108ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

వాహనాలు తనిఖీ చేసిన సీఐ కన్నప్ప రాజు

విశాలాంధ్ర - ఎటపాక: మండలంలోని ఎటపాక మండలం గుండాల జాతీయ రహదారిలో వాహనాలను సీఐ కన్నప్పరాజు శనివారం తనిఖీలు చేపట్టారు. తరచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వవద్దని, అలాగే సరైన పత్రాలు లేని వాహనాలను, నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్డుపై నడిపిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, వాహనాలకు ఉన్న పెండింగ్ చలాన్లు కట్టివేయాలని అన్నారు. ఈ తనిఖీలో ఎస్సై అప్పలరాజు, పోలిస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మిపురంలో రోడ్డు ప్రమాదం: ఒకరు మృతి

విశాలాంధ్ర - ఎటపాక: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన ఎటపాక మండలం లక్ష్మీ పురం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్కాన్ గిరీ మోటు కలిమెల మండలం, గ్రామానికీ చెందిన పండా బజారి (38), స్కూటి మీద భద్రాచలం వస్తుండగా లక్ష్మిపురం వద్ద చింతూరు వెళ్ళుపు వెళ్తున్నా టాటా మ్యాజిక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్ట్ మార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రి కి తరలించారు. ఈ కేసును ఎటపాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.